నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 30 నవంబర్ 2024 RANGAREDDY



## నరేందర్ రెడ్డిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి..

**- డాక్టర్ మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు**

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిపై పెట్టిన కేసులను ఎత్తివేసి, వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరేందర్ రెడ్డి అరెస్ట్‌ను ఖండిస్తున్నామని, రైతుల పక్షాన నిలబడిన నరేందర్ రెడ్డి.. జైలుకెళ్లినా హీరో అయ్యారని, సీఎం రేవంత్ జీరో అయ్యారని విమర్శించారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీ అమలయ్యేలా నిలదీసి వంద మీటర్ల లోతులో బొంద పెట్టడం ఖాయమన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ఉద్యమకారులకు పెద్దపీట వేస్తామన్నారు.




## తెలంగాణ ఏర్పాటుకు కీలక మలుపే దీక్షాదివస్..

**- మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే**

కేసీఆర్ 2009 నవంబర్ 29న చేపట్టిన దీక్షే తెలంగాణ ఏర్పాటుకు కీలక మలుపు అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో.. అన్న నినాదంతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందన్నారు. 2014లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ దీక్షాదివస్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేసినందుకు సంతోషంగా ఉన్నదన్నారు. డిసెంబర్ 1 తేదీన దవాఖానలలో రోగులకు పండ్లు పంపిణీ, 2వ తేదీన కళాకారుల ఆటపాట, 3వ తేదీన అమరుల కుటుంబాలకు సన్మానం, 4వ తేదీన విద్యార్థులతో ప్రత్యేక సమావేశాలు, 5వ తేదీన రక్తదాన శిబిరాలను నిర్వహించాలని కిషన్‌రెడ్డి సూచించారు.




దీక్షాదివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



దీక్షాదివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

# దశ మార్చిన దీక్ష

## సకల జనులను సంఘటితం చేసిన కేసీఆర్

**పదవులను త్యాగం చేసి తెలంగాణవాదం ఉన్నదని చాటిచెప్పిన మహానేత కేసీఆర్**

**రేవంత్ ఫెయిల్యూర్ సీఎం..**

**లగచర్ల ఘటనతోనైనా సీఎం బుద్ధి తెచ్చుకోవాలి**

**రేవంత్.. 2014కు ముందు పాత రోజులు తీసుకొచ్చారు**

**తెలంగాణ రాకముందు తాగునీటికి కిలోమీటర్ల మేర నడకయాతన**

**కేసీఆర్ ప్రభుత్వంలో ఇంటింటికీ తాగునీరు, 24 గంటల కరెంట్**

**దీక్షాదివస్ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి**

వికారాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, పదవులను త్యాగం చేసి తెలంగాణవాదం ఉన్నదని చాటిచెప్పిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం దీక్షాదివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, రోహిత్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్సీ క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలోనే 2014కు ముందు పాత రోజులను రేవంత్ రెడ్డి తీసుకొచ్చారన్నారు. సీఎంగా రేవంత్.. అన్ని విషయాల్లోనూ ఫెయిల్ అయ్యారని, లగచర్ల ఘటనతోనైనా బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. లగచర్ల ఘటనలో ప్రజల్లోనే చైతన్యం వచ్చిందని, గిరిజనుల వెనుక ఎవరూ లేరన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లోని 17 నియోజకవర్గాల్లో రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్దాం, ప్రజలు ఎవరి వెనుకాల ఉన్నారో తెలుస్తుంది.. అని నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. జనవరి, ఫిబ్రవరిల్లో పార్టీ కమిటీలు ఉంటాయని, ఉద్యమకారులకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ రాక ముందు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి బిందెలతో తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేన్నారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు, 24 గంటల కరెంట్‌ను సరఫరా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు నాగేందర్ గౌడ్, వీరమణి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ రాజూగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



## కేసీఆర్ పోరాటం చరిత్రలో నిలిచిపోతుంది..

**- మాజీ ఎమ్మెల్యే, కొప్పుల మహేశ్‌రెడ్డి**

తెలంగాణ రాష్ట్ర సాధనకుగాను మాజీ సీఎం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసి 15 ఏండ్లు అయ్యిందని, కేసీఆర్ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్‌తోనే అన్నది అందరూ గుర్తుంచుకోవాలన్నారు. రైతులకు అండగా నిలిచిన నరేందర్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని, ఏ సమస్య వచ్చినా నాలుగేండ్లు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేయాలన్నారు.



## దామగుండం మోదీకి.. లగచర్ల అల్లుడికి..

**- మాజీ ఎమ్మెల్యే, పైలట్ రోహిత్ రెడ్డి**

సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలోని దామగుండాన్ని మోదీకి, లగచర్లను అల్లుడికి అప్పజెప్పారని, మొబిలిటీ వ్యాలీని మరొకరికి అప్పజెప్పడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. లగచర్లలో ప్రభుత్వం వెనక్కి తగ్గడం బీఆర్ఎస్ విజయమని, లగచర్ల విషయంలో రైతుల పక్షాన నిలబడి యావత్ ప్రపంచానికి తెలిసేలా చేసి బీఆర్ఎస్ పార్టీ న్యాయం చేసిందన్నారు. రైతుల పక్షాన నిలబడిన నరేందర్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని, సొంత తమ్ముడిని అరెస్ట్ చేస్తే మహేందర్ రెడ్డి స్పందన లేదని, కాంగ్రెస్ పార్టీలోకి రావాలని నరేందర్ రెడ్డిపై మహేందర్ రెడ్డి ఎంత ఒత్తిడి తెచ్చినా కేసీఆర్, కేటీఆర్, కొడంగల్ ప్రజల కోసం బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. కేసులకు భయపడొద్దని, మీ వెంట మేము అండగా ఉంటామని భరోసానిచ్చారు.



## తెలంగాణలో అరాచక పాలన నడుస్తుంది..

**- పి.శ్రీశైల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలన నడుస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పి.శ్రీశైల్ రెడ్డి అన్నారు. సీఎం సొంత ఊరిలో మాజీ సర్పంచ్ చనిపోతే అంత్యక్రియలు చేసుకోలేని పరిస్థితి ఉన్నదని విమర్శించారు. లగచర్ల గిరిజన మహిళలపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని, మనమంతా ఒక్కటిగా నిలబడాలన్నారు. 2014కు ముందు తెలంగాణ ఎలా ఉన్నదో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ పరిస్థితి అదేవిధంగా ఉన్నదన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీపై పగ తీర్చుకోవాలని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీదే అధికారమన్నారు.

# చరిత్రకు మలుపు

## ప్రాణాలు పణంగాపెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్

**కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది..**

**'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అన్న నినాదంతో ఒక్కటైన తెలంగాణ ప్రజలు**

**దీక్షాదివస్‌లో మాజీ మంత్రులు సబితారెడ్డి, మహమూద్ అలీ**



శంషాబాద్‌లోని దీక్షాదివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మహమూద్ అలీ

శంషాబాద్ రూరల్, నవంబర్ 29 : 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అన్న నినాదంతో కేసీఆర్ చేపట్టిన ఆమరణనిరాహార దీక్షతోనే కేంద్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన చేసిందని మాజీ మంత్రులు సబితారెడ్డి, మహమూద్ అలీ పేర్కొన్నారు. శుక్రవారం శంషాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన దీక్షాదివస్ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ముందుండి పోరాటం చేయడం వల్లే 2014లో నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు. తెలంగాణ సాధించిన ఉద్యమకారుడిగా కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు పట్టం కట్టారని గుర్తుచేశారు. పదేండ్ల పాటు రాష్ట్రాభివృద్ధితోపాటు అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందాయన్నారు. కేసీఆర్ పాలనలో దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని, కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్న ఏడాది కాలంలోనే రాష్ట్రం అధోగతిపాలవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బాపు కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఐటీ, రియల్ రంగాలు విపరీతంగా అభివృద్ధి చెందాయని, ఏ ప్రాంతంలోనైనా ఎకరా భూమికి రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు డిమాండ్ వచ్చిందన్నారు. రైతు బంధు, రైతు బీమా పథకాలను పక్కాగా అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లకు కల్యాణలక్ష్మితో ఆర్థిక సాయం అందించారని, మిషన్‌కాకతీయ ద్వారా చెరువుల పూడికతీత, పునరుద్ధరణ పనులు చేశారన్నారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసిన గొప్ప మహానేత కేసీఆర్ అని గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ వెంకటరమణరెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి, ఈట గణేశ్, సత్యనారాయణ, శంషాబాద్ మాజీ ఎంపీపీ జయమ్మాశ్రీనివాస్, శంషాబాద్ కౌన్సిలర్ భారతమ్మ, దిద్యాల శ్రీనివాస్, కొన్నమొల్ల శ్రీనివాస్, అవినాశ్‌రెడ్డి, మంచర్ల మోహన్‌రావు, గుంటి చరణ్, అశోక్, చిన్నగండు రాజేందర్, హన్మంతు ముదిరాజ్ పాల్గొన్నారు.



## కేసీఆర్ దీక్షతోనే దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం..

**- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**

తెలంగాణ ఉద్యమ రథసారధి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని అన్నారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నా.. విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకుంటున్నా.. అప్పటి ప్రభుత్వం స్పందించకపోవడంతో తెలంగాణ కోసం ప్రాణత్యాగానికి సిద్ధమై దీక్షను చేపట్టిన మహానేత కేసీఆర్ అని పేర్కొన్నారు. సీమాంధ్ర నాయకుల ఒత్తిడితో వెనక్కి తగ్గిన కేంద్ర ప్రభుత్వం.. కరీంనగర్‌లో కేసీఆర్ చేపట్టిన ఆమరణనిరాహార దీక్షతో కేంద్రం దిగివచ్చి 2014జూన్ 2 తేదీన తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసిందని వివరించారు.



## తెలంగాణ ఉద్యమ చరిత్ర మరువలేనిది..

**- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**

హైదరాబాద్ రాష్ట్రాన్ని బలవంతంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కలిపితే.. ఆంధ్ర పాలకులు ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని, ఆంధ్ర పాలకుల తీరు నచ్చక 1969లో తెలంగాణ ఏర్పాటుకు ఉద్యమం ప్రారంభమైందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది అసువులుబాసినా ఫలితం దక్కలేదన్నారు. దేశవ్యాప్తంగా బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసిందన్నారు. 2001లో కేసీఆర్ న్యాయకత్వంలో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమం... 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన దీక్షతోనే రాష్ట్రం సిద్ధించిందన్నారు. కేసీఆర్ పాలనలో పదేండ్లు అద్భుత పాలన అందించారన్నారు.



## కేసీఆర్ ఉద్యమ పటిమ చరిత్రలో నిలిచిపోతుంది..

**- కార్తీక్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఇన్‌చార్జి**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీఆర్ఎస్ అధినేత ముందుండి నడిపించిన ఉద్యమ పటిమ చరిత్రలో నిలిచిపోతుందని రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి అన్నారు. నాడు బలవంతంగా తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన నాటి నుంచి ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం కొనసాగిందన్నారు. కేసీఆర్ రథసారధిగా సాగిన ఉద్యమంలో తెలంగాణ సమాజమంతా పోరాటంలో పాలుపంచుకున్నదన్నారు. తెలంగాణ కోసం ఎంతోమంది అసువులు బాస్తుతుండగా, చలించిన కేసీఆర్ తెలంగాణ కోసం సచ్చుడో.. రాష్ట్రం వచ్చుడోనని చేపట్టిన దీక్షతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. కేసీఆర్ ఉద్యమ తీరును భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉన్నదన్నారు. అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడిపించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు.. ఇక సాగవని, రాబోవు రోజుల్లో వారికి తగిన గుణపాఠం తప్పదని అన్నారు.

## కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు అష్టకష్టాలు

**ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు**

తాండూరు, నవంబర్ 29 : కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని, గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారకులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం తాండూరులో ఏబీవీపీ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆత్మహత్యలను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఏడాదిలోపు ఎంతో మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ బారిన పడినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ పతనమవుతున్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో తుగ్లక్‌పాలన సాగిస్తున్నారన్నారు. విద్యార్థులతోపాటు రైతులు, సామాన్యులకూ ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు అధికారులు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధులు చేతన్ సింగ్, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌చారి, భాను ప్రకాశ్, తనూశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కారకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ తాండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు, విద్యార్థులు



## దామగుండం అడవిని సందర్శించిన డీఎఫ్‌వో

దామగుండం అడవిలో జరిగిన అగ్ని ప్రమాదంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని వికారాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారి(డీఎఫ్‌వో) జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన దామగుండం అడవిలో ఉంటున్న స్వామీజీ ఆశ్రమ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. దామగుండం అడవిలో కేవలం 10 నుంచి 20 ఎకరాల భూమిలోనే మంటలు చెలరేగినట్లు చెప్పారు. గురువారం రాత్రి చెలరేగిన మంటలను ఫైర్ సిబ్బంది, ఫారెస్ట్ సిబ్బంది ఆర్పినట్లు తెలిపారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామన్నారు. ఆయనతో శ్యామ్, అరుణ, నేవీ అధికారులు మల్లికార్జున్‌రావు, పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

–పూడూరు, నవంబర్ 29

## కంప్యూటర్లను వదిలి.. పొలాలకు కదిలి



**వేదాన్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈవై, గుడ్ ఎరా సాఫ్ట్‌వేర్ సంస్థల ఉద్యోగులు దాదాపు 200 మంది శుక్రవారం పొలాల బాట పట్టారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ తారామతిపేట గ్రామ పరిధిలోని జాతీయ ఆదర్శ రైతు నాగరత్నం నాయుడు వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించారు. పంటల సాగు, వ్యవసాయ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. పంట కోశారు.**

**- పెద్దఅంబర్‌పేట, నవంబర్ 29**

